తీరనున్న వారధి కష్టాలు..

- ఎట్టకేలకు పెనుబల్లి వంతెనకు మోక్షం
- కొత్త బ్రిడ్జికి రూ.3 కోట్లు మంజూరు
- ఇటీవల పనులు ప్రారంభం



శిథిలావస్థకు చేరుకున్న పెనుబల్లి లోలెవల్ వంతెన

చుంచుపల్లి: కొత్తగూడెం– పెనుబల్లి గ్రామాల ప్రజలకు వారధి కష్టాలు త్వరలో తీరనున్నాయి. ఇక్కడ కొత్త బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో మోక్షం కలిగింది. ఈ రెండు గ్రామాల మధ్య గోదుమవాగుపై నున్న బ్రిడ్జి ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. రెండేళ్లుగా దీన్ని పట్టించుకునే నాథుడే లేడు. అధికారులు కొత్త బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించి అనుమతులకు వేచి చూస్తున్నారు. చుంచుపల్లి మండల పరిధిలో మేజర్ గ్రామ పంచాయతీల్లో ఒకటైన పెనుబల్లి గ్రామ ప్రజలకు వర్షాకాలంలో ఈ శిథిలావస్థకు చేరిన వంతెన వల్ల అవస్థలు తప్పడం లేదు. కొత్త బ్రిడ్జి నిర్మాణానికి నోచుకోకపోవడంతో గ్రామాలకు వరద పోటు తప్పడం లేదు. ఎట్టకేలకు దీని విషయంలో ఇటీవల ప్రభుత్వం స్పందించి నిధులను మంజూరు చేయడంతో గత సెప్టెంబర్‌లో కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు కొత్త వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ నూతన బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం రూ.3 కోట్లు నిధులు కేటాయించింది. ఈ పనుల పర్యవేక్షణ బాధ్యతలను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగానికి అప్పగించారు. ఈ పనులను వచ్చే ఏడాది చివరి వరకు పూర్తి చేయాలని ఆదేశాలున్నాయి. టెండర్లను ఖరారు చేసిన అధికారులు త్వరలో పనులను మొదలు పెట్టేలా కార్యాచరణ చేస్తున్నారు. గోధుమ వాగుపై కొత్త వంతెన అందుబాటులోకి వస్తే రవాణా సౌకర్యాలు సైతం మరింతగా మెరుగుపడతాయని ప్రజలు ఆశిస్తున్నారు. ఇన్నాళ్లు వరదల సమయంలో ఇబ్బందులు పడ్డామని వాటి నుంచి కూడా త్వరలో విముక్తి కలుగుతుందని పలువురు అంటున్నారు.

వరదల సమయంలో ప్రజలు సతమతం..

పెనుబల్లి గ్రామంలో రెండు వేల వరకు జనాభా నివాసముంటున్నారు. కొత్తగూడెం పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామంలోని ప్రజలు ప్రతీ అవసరానికి రోజూ జిల్లా కేంద్రానికి రావాల్సిందే. పెనుబల్లి– కొత్తగూడెం పట్టణాల మధ్య గోధుమ వాగు మూడు కిలోమీటర్ల మేర ప్రవహిస్తోంది. ఇక్కడ గోధుమవాగుపై ఏర్పాటు చేసిన లోలెవెల్ వంతెన రెండు గ్రామాల మధ్యన వారధిగా నిలుస్తోంది. ఈ వంతెనను దాదాపు 20 ఏళ్ల క్రితం నిర్మించారు. నిత్యం గ్రామస్తులతో పాటు ఇతర అవసరాల నిమిత్తం దీని మీదుగా పలురకాల వాహనాలు తిరుగుతుంటాయి. ప్రజలు సైతం కొత్తగూడెం పట్టణానికి రావాలంటే ఈ బ్రిడ్జి మీదుగా కాలినడకనే వస్తుంటారు. రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ వంతెన ప్రస్తుతం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. బ్రిడ్జి పైన ఎక్కడ పడితే అక్కడ గుంతలు తేలి బీటలు పడ్డాయి. వంతెనకు ఇరువైపులా ఉండాల్సిన రక్షణ దిమ్మెలు సైతం ధ్వంసమయ్యాయి. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు ఈ లోలెవెల్ వంతెన పూర్తిగా దెబ్బ తిన్నది. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రతి వర్షాకాలంలో కురిసే భారీ వర్షాలకు పెనుబల్లి గ్రామానికి కొత్తగూడెం పట్టణానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతుంటాయి. దీంతో గ్రామస్తులకు రెండు మూడు రోజుల వరకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతుంటాయి. వరద ఉధృతి తగ్గిన తర్వాత మళ్లీ వంతెన పైనుంచి రాకపోకలు కొనసాగడం ఆనవాయితీగా మారుతోంది. రెండేళ్ల క్రితం రూ.3 కోట్ల వ్యయ అంచనాలతో కొత్త బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలను అధికారులు ప్రభుత్వానికి పంపారు. ఈ విషయంలో పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించిన సర్కారు ఎట్టకేలకు నిధులు కేటాయించడంతో పెనుబల్లి కొత్త వంతెన నిర్మాణానికి మోక్షం కలిగింది. ఇన్నాళ్లకు కొత్త వంతెన నిర్మాణానికి ప్రభుత్వం ముందుకురావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పెనుబల్లి వంతెనపై గోధుమవాగు వరద (ఫైల్)

అధికారుల చొరవతో వంతెన నిర్మాణం



పెనుబల్లి గోధుమవాగుపై ఉన్న లోలెవల్ వంతెన శిథిలావస్థకు చేరుకుంది. దీనివల్ల వర్షాకాలంలో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు రెండేళ్ల క్రితమే కొత్త వంతెన నిర్మాణానికి అంచనా వేసి ప్రభుత్వానికి పంపించారు. ఎట్టకేలకు ఇటీవల నిధులు కూడా రావడంతో ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ నిర్మాణం పూర్తయితే గ్రామస్తులకు వారధి కష్టాలు తీరుతాయి.

– రెడ్డి శ్రీనివాస్, సర్పంచ్, పెనుబల్లి

సకాలంలో నిర్మాణానికి చర్యలు



పెనుబల్లి లోలెవల్ వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్త వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించింది. దీనిలో భాగంగా ఇటీవల కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుతో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించాం. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు పెనుబల్లి కొత్త వంతెన నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించాం.

– ఎస్.సత్యనారాయణ, పీఆర్, డీఈ

లంబాడీలకు అన్యాయం జరిగింది..



మాట్లాడుతున్న రమేష్‌నాయక్

కొత్తగూడెంటౌన్: జనాభా దామాషా ప్రకారం జిల్లాలో ఎస్టీలకు ఎక్కువ ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నాలుగు సీట్లలో కనీసం ఒక్కటీ కూడా కేటాయించకపోవడం దారుణమని లంబాడీలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రమేష్‌నాయక్ అన్నారు. శుక్రవారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గిరిజన తెగలలో లంబాడీలు 25 లక్షల మంది, గోండులు 3 లక్షలు, కోయలు 6 లక్షలు, 32 తెగలు కలిపి 6 లక్షల జనాభా ఉన్నారన్నారు. జనాభా ప్రకారం లంబాడీలకు 10 సీట్లను కేటాయించాలని లంబాడీలకు ఎస్టీ రిజర్వు సీట్లలో మూడు, జనరల్ స్థానాల్లో మూడు టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. గోండుల టికెట్లను లంబాడీలకు కేటాయించి వారి మధ్య గొడవలు పెట్టాలని చూస్తున్నారని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నాలుగు ఎస్టీ స్థానాల్లో కనీసం ఒక్కటి కూడా లంబాడీలకు కేటాయించకపోవడం దారుణమన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరీ గత పదేళ్లుగా పార్టీకి నిరంతరాయంగా పని చేస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ తేజావత్ బెల్లయ్య నాయక్‌కు మహబూబాబాద్ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లంబాడీలకు టికెట్ల కేటాయింపులో న్యాయం జరగకపోతే కాంగ్రెస్ పోటీ చేసిన స్థానాల్లో గెలుపును అడ్డుకుంటామని హెచ్చరించారు. మంగీలాల్ నాయక్, మోహన్‌నాయక్, ప్రసాద్‌నాయక్, రవి నాయక్ పాల్గొన్నారు.

జెండా మోసిన వారికే టికెట్ ఇవ్వండి



మాట్లాడుతున్న రాంరెడ్డి గోపాల్‌రెడ్డి

ఇల్లెందు: పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి, జెండా మోసిన వారికి ఎమ్మెల్యే టికెట్ ఇస్తే గెలిపించుకుంటామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఇల్లెందులో మాజీ మంత్రి రాంరెడ్డి వెంకటరెడ్డి అభిమానుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. జిల్లా నాయకుడు చీమల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ సోదరుడు రాంరెడ్డి వెంకటరెడ్డి టికెట్ ఇప్పించి గెలిపిస్తే ఆయననే మోసం చేశారని, పార్టీకి వెన్నుపోటు పొడవటంతో తట్టుకోలేక అనారోగ్యం పాలై మృతి చెందాడన్నారు. మరణానంతరం అదే పాలేరు నుంచి ఏకగ్రీవంగా కేటాయించాల్సిన సీటులో పోటీ చేసి ఓడించిన పార్టీలో చేరిన వారే ఈరోజు టికెట్ కావాలని పట్టు పట్టడం దారుణం అన్నారు. ఆశావహ అభ్యర్థులలో ఎవరికి టికెట్ ఇచ్చినా గెలిపించుకుంటామన్నారు. ఈ సభలో కాంగ్రెస్ ఆశావహ అభ్యర్థులు భూక్యా దళ్‌సింగ్‌నాయక్, డాక్టర్ జి.రవి, డాక్టర్ బి.రాంచందర్‌నాయక్, కామేపల్లి జెడ్పీటీసీ వెంకట ప్రవీణ్ నాయక్, ఆరెం పాపారావు, భూక్యా స్రవంతి, డాక్టర్ శంకర్ నాయక్, గుండెబోయిన నాగమణి, బాలాజీరావునాయక్‌లు మాట్లాడుతూ.. ఇక్కడి నుంచి రెండుసార్లు కాంగ్రెస్ అభ్యర్థులుగా గెలిచి పార్టీ ఫిరాయించారన్నారు. పార్టీ కోసం పని చేసిన వారికి టికెట్ ఇస్తే పార్టీ బతుకుందన్నారు. సమావేశంలో చరణ్‌రెడ్డి, నాగమణి, స్రవంతి, కృష్ణగౌడ్, జలీల్, వల్లాల రాజయ్య, హరికృష్ణ పాల్గొన్నారు.

బహుజనుల రాజ్యస్థాపనే బీఎస్పీ లక్ష్యం



ప్రచారం చేస్తున్న ప్రతాప్, కార్యకర్తలు

టేకులపల్లి: తెలంగాణలో బహుజనుల రాజ్యస్థాపనే బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) లక్ష్యమని ప్రజలు ఆశీర్వదించాలని ఆ పార్టీ ఇల్లెందు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాదావత్ ప్రతాప్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం టేకులపల్లి మండలంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటించారు. ఇంటింటికీ తిరిగి బీఎస్పీ అధికారంలోకి వస్తే అమలు చేసే కాన్షీ యువ సర్కార్, పూలే విద్యా దీవెన, బహుజన రైతు బీమా, బ్లూ జాబ్ కార్డ్, దొడ్డి కొమరయ్య భూమి హక్కు, నూరేళ్ల ఆరోగ్య బీమా, చాకలి ఐలమ్మ మహిళా జ్యోతి, వలస కార్మికుల సంక్షేమ నిధి, భీం రక్షా కేంద్రాలు, షేక్ బందగీ గృహ భరోసా తదితర మేనిఫెస్టో పథకాలను వివరించారు. ఓట్లు మనవే.. సీట్లు మనవే.. అధికారం మనదే.. వచ్చేది బహుజన రాజ్యమే అంటూ ప్రచారం చేస్తూ ఏనుగు గుర్తుపై ఓటు వేసి బహుజన రాజ్య స్థాపనకు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో పూనెం రామస్వామి, శేఖర్, మంగీలాల్, కిషన్, శర్మ, నాగేశ్వర్‌రావు, వెంకన్న, రాజేష్, లోకేష్, కిరణ్, సాయి, విక్రమ్ పాల్గొన్నారు.

బీఎస్పీలో చేరిక

ఇల్లెందు: పట్టణంలో పలువురు శుక్రవారం బీఎస్పీలో చేరారు. బీఎస్పీ ఇల్లెందు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బాదావత్ ప్రతాప్ చేతుల మీదుగా వైఎస్‌ఆర్‌టీపీకి చెందిన కాళీచరణ్ సందీప్, అల్లా బకాష్‌లకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కుమార్, శ్రీనివాసరావు, కాంతారావు, రాయల శ్రీనివాసరావు, శ్రీరాములు, శేఖర్, లోకేష్, రాకేష్, కిరణ్, విక్రమ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

నవభారత్: దసర పండుగ సందర్భంగా ప్రజలు కుటుంబ సమేతంగా మార్కెట్‌లో షాపింగ్, అవసరాల నిమిత్తం బయటకి వస్తుంటారని పెద్దబజార్, చిన్న బజార్ ఎంజీ రోడ్డు, ఓల్డ్ డిపో రోడ్లపై వాహనదారులు, ఆటో, రిక్షాలు, కార్ల వలన ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా పోలీసులకు సహకరించాలని ఎస్‌ఐ నరేష్ శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు.

పాలస్తీనాపై దాడులు అమానుషం

జూలూరుపాడు: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు చేయడాన్ని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. పార్టీ ఆధ్వర్యంలో గుండెపుడిలో శుక్రవారం నిరసన తెలిపారు. పార్టీ కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి ఎస్కే ఉమర్ మాట్లాడుతూ.. పాలస్తీనాపై అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ దాడులు చేస్తోందని, దీనిని దేశ ప్రజలు ఖండించాలని పిలుపునిచ్చారు. వల్లోజి రమేష్, బి.గోపి, కె.జమలయ్య, కృష్ణ, రమేష్, పుల్లమ్మ, సీత, జయశ్రీ పాల్గొన్నారు.

టేకులపల్లి: పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా నేత దుబాకుల ప్రసాద్, మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు అన్నారు. కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం టేకులపల్లి సెంటర్‌లో నల్ల బ్యానర్లతో నిరసన తెలిపారు. గుగులోతు రామచంద్ర, మేకల వినోదు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీకి గుణపాఠం తప్పదు



మాట్లాడుతున్న మాజీ ఎంపీ రవీంద్ర నాయక్

ఇల్లెందు: వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి గుణపాఠం తప్పదని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీ రవీంద్రనాయక్ అన్నారు. శుక్రవారం ఇల్లెందులోని బీజేపీ కార్యాలయంలో పోలింగ్ బూత్ కమిటీలు బలోపేతం, శక్తి కేంద్రం సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్‌ను ఇంటికి పంపేందుకు ఇప్పటికే తెలంగాణ ప్రజలు ఒక నిర్ణయానికి వచ్చినట్లు చెప్పారు. అన్ని రంగాల్లో తెలంగాణ ఆగమైపోయిందన్నారు. కుటుంబ పాలనతో ప్రజలు విసిగిపోయారని పేర్కొన్నారు. ప్రపంచంలో అత్యధిక సభ్యత్వం కలిగిన అతిపెద్ద పార్టీగా బీజేపీ అవతరించిందన్నారు. అత్యంత ప్రతిష్ట కలిగిన నేతలుగా మోదీ, అమిత్‌షా, నడ్డా, కిషన్‌రెడ్డి ఉన్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల తరువాత రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ రాబోతోందని జోస్యం చెప్పారు. సీఎం కేసీఆర్ ప్రజల జీవితాలతో ఆటలాడుకుంటున్నాడని విమర్శించారు. దళితబంధు, బీసీ బంధు, గిరిజన బంధు, మైనార్టీ బంధులు కేవలం ఎన్నికలప్పుడు ఓట్ల కోసం పుట్టిన పథకాలేనన్నారు. టీఎస్‌పీఎస్‌సీ వల్ల 36 లక్షల మంది నిరుద్యోగులు రోడ్డున పడ్డారని ఇది ప్రభుత్వం అసమర్థతకు నిదర్శనం అన్నారు. ప్రవల్లిక మృతిని కూడా కేటీఆర్ రాజకీయం చేశాడని తెలిపారు. కుల వృత్తులను నిర్వీర్యం చేశాడని, కార్పొరేషన్ల జాడ లేకుండా పోయిందన్నారు. తెలంగాణలో 1569 మంది ఆత్మహత్య చేసుకుంటే ఒక్క కుటుంబానికి కూడా చిల్లి గవ్వ ఇవ్వలేదన్నారు. సమావేశంలో బలగాని గోపీకృష్ణ, నాళ్ల సోమసుందర్, ఊకె అబ్బయ్య, హతీరాం నాయక్, రాంచందర్ నాయక్, బాలాజీనాయక్, పూన్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించండి



అటవీశాఖ నివేదికను వివరిస్తున్న డీఆర్‌ఓ సాల్మన్‌రాజ్

ఇల్లెందురూరల్: కొమరారం పీహెచ్‌సీలో తక్షణం వైద్యసేవలు మెరుగుపరచాలని మండల పరిషత్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఎంపీపీ చీమల నాగరత్నమ్మ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రతీరోజు 150కి పైగా ఓపీ నమోదవుతున్న కొమరారం పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు అవసరం ఉండగా ఒకరిని డిప్యూటేషన్‌పై గుండాలకు పంపించడమేమిటని ఎంపీటీసీ ఆజ్మీర బిచ్చా మండిపడ్డారు. ఆస్పత్రిలో కనీసం సిడిల్స్ కూడా లేవని వాపోయారు. గ్రామపంచాయతీ నిధుల నుంచి కొనుగోలు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ ఫ్రీజింగ్ వల్ల సాధ్యం కాలేదన్నారు. ప్రభుత్వం అర్హులైన గిరిజన రైతులకు పోడు పట్టాలు మంజూరు చేసిందని, ఆయా భూములలో బోర్లు వేసుకునేందుకు అటవీశాఖ అధికారులు అభ్యంతరం చెప్పడం సరికాదని సర్పంచ్ మోకాళ్ల కృష్ణ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. బోర్ల విషయంలో అటవీశాఖ అధికారులు చేతివాటం మానుకోవాలని సూచించారు. దళిత బంధు, బీసీ బంధు, గృహలక్ష్మి పథకాలకు అర్హులైన లబ్ధిదారుల ఎంపికలో క్షేత్రస్థాయి ప్రజాప్రతినిధులను ఉత్సవ విగ్రహాలుగా మార్చారని పలువురు ప్రజాప్రతినిధులు వాపోయారు. అంతా అధికార పార్టీ కనుసన్నల్లో జరగడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు విడుదల కాకపోవడంతో పాలన ఇబ్బందికరంగా మారిందని పోలారం సర్పంచ్ వాంకుడోత్ సరోజిని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపీడీఓ బాలరాజు, ఎంపీఓ చిరంజీవి, ఎంఈఓ పిల్లి శ్రీనివాస్, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఈనెల 26న మందకృష్ణ మాదిగ రథయాత్ర



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కొత్తగూడెంటౌన్: సింగరేణి కార్మిక ప్రాంతంలో ఈ నెల 26న జరగనున్న రథయాత్రను విజయవంతం చేయాలని మాదిగ సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ కొయ్యాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం రామవరంలోని సంఘ భవనంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడి ఎస్సీ వర్గీకరణకు పోరాటాలు చేస్తూ, ఉద్యమాలు చేస్తున్న మందకృష్ణ మాదిగకు మనందరం తోడుగా నడవాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని రథయాత్ర ద్వారా అన్ని జిల్లాల్లో తిరుగుతూ మన జిల్లాకు వస్తున్న మన నాయకుడికి ఘన స్వాగతం పలకాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ కోసం జరగనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, వచ్చే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో కేంద్రం ఎస్సీ వర్గీకరణ చేసి చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాదిగ సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు బరిగేల భూపేష్, సామర్ల సమ్మయ్య, చాట్ల హనుమంతు, డప్పు కుమార్, బొంకూరి పోశం, కూరగాయల శ్రీను, కొత్తురి మదనయ్య, గడ్డం రాజశేఖర్, ఇండిగపల్లి శంకర్, జనగం రాజయ్య, నమిల్ల మధు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్కేసి పువ్వేసి చందమామ..



ఇల్లెందురూరల్: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



సుజాతనగర్‌లో...

ఇల్లెందురూరల్: మండలంలోని సెర్ప్ కార్యాలయంలో పొదుపు సంఘాల మహిళలు బతుకమ్మ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సేకరించిన రంగురంగు పూలతో ఏడవ రోజు వేపకాయల బతుకమ్మలను అందంగా పేర్చారు. కార్యాలయ ఆవరణలో గౌరమ్మను ప్రతిష్ఠించి పూజ చేసి, వేయించిన బియ్యం పిండి, వేపపండ్లను నైవేద్యంగా సమర్పించారు.

మహిళలు బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఒక్కేసి పువ్వేసి చందమామ..., ఊరికి ఉత్తరాన ఊడల మర్రి..., ఒక్కడే మాయన్న వచ్చన్న పోడాయే.. అంటూ ఆడిపాడరు. కార్యక్రమంలో ఏపీఎం దర్గారావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఊకే నాగమణి, కార్యదర్శి సద్గుణ, కోశాధికారి వద్దే సౌజన్య, ఉద్యోగులు నాగేంద్ర, స్వర్ణలత, నందకుమారి, సంపత్, లాలయ్య, కొమ్మాలు, ప్రగతి, గ్రామ సంఘాల సహాయకులు విజయలక్ష్మి, సరిత, సంధ్య పాల్గొన్నారు.

సుజాతనగర్: బతుకమ్మ వేడుకల్లో భాగంగా ఏడో రోజు శుక్రవారం వేపకాయల బతుకమ్మను మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా గ్రామాల్లో మహిళలు, యువతులు బతుకమ్మ ఆడి, దగ్గరలోని కాలువులు, వాగుల్లో నిమజ్జనం చేశారు.

శ్రీ సరస్వతీ దేవి రూపంలో అమ్మవారు

జూలూరుపాడు: మండలంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శ్రీ దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆరో రోజు అమ్మవారు శ్రీ సరస్వతి దేవీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. వెంగన్నపాలెం టచర్స్ కాలనీ, జూలూరుపాడు శ్రీసీతారామాలయంలో శ్రీ సరస్వతి దేవీ రూపంలో ఉన్న అమ్మవారిని చిన్నారులు, తల్లిదండ్రులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. అదేవిధంగా పలువురు చిన్నారులు శ్రీ సరస్వతి దేవీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాపకొల్లు శ్రీ ఉమాసోమలింగేశ్వరాలయం, కోటమైసమ్మతల్లి ఆలయం, బొడ్రాయి సెంటర్, కొమ్ముగూడెం శ్రీపెద్దమ్మతల్లి ఆలయం, సురారం శ్రీసీతారామాలయం, అనంతారం, వెంగన్నపాలెం, బొడ్రాయి సెంటర్‌లో శ్రీదేవీ నవరాత్రి మహోత్సవ పూజలు జరుగుతున్నాయి.

సుజాతనగర్: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో కొలువు దీరిన దుర్గామాతకు భక్తులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సరస్వతీదేవి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వగా పలువురు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

టేకులపల్లి: అమ్మవారి నవరాత్రి వేడుకలు మండలంలో అత్యంత వైభవంగా జరుపుకున్నారు. టేకులపల్లిలోని రామాలయం వద్ద, బోడు, రామచంద్రునిపేట, వీరబ్రహ్మేంద్ర స్వామి గుడి వీధి, కోయగూడెం, కోయగూడెం ఓపెన్‌కాస్టు తదితర గ్రామాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆరో రోజు శుక్రవారం అమ్మవారు సరస్వతీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఇల్లెందు: పట్టణంలోని 20వ వార్డు స్టేషన్‌బస్తీలో కొలువు దీరిన దుర్గామాతకు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం స్థానిక కౌన్సిలర్ మొగిలి లక్ష్మితో కలిసి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అన్నదానం ప్రారంభించారు. కౌన్సిలర్లు వార రవి, అంకెపాక నవీన్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

పాల్వంచ: మున్సిపాలిటీ పరిధిలోని మంచికంటినగర్‌లో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మద్దినేని నవీన్‌కుమార్, బబ్లు, ప్రేమ్, రాకేశ్, భరత్, మణిదీప్, రవితేజ, లిఖిత, శిరీష, స్వాతిరెడ్డి పాల్గొన్నారు.



టేకులపల్లి రామాలయం వద్ద సరస్వతీ దేవి అవతారంలో అమ్మవారు



సుజాతనగర్‌లో అమ్మవారి మండపంలో పూజలు చేస్తున్న భక్తులు



జూలూరుపాడు: శ్రీ సరస్వతి దేవీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న చిన్నారులు

క్లుప్తంగా

బీఆర్‌ఎస్ అసత్య ప్రచారం

పాల్వంచ: కేంద్ర ప్రభుత్వ పథకాలపై బీఆర్‌ఎస్ పార్టీ అసత్య ప్రచారాలు చేస్తోందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం స్థానిక శ్రీనగర్ కాలనీలో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వానికి మాటలే తప్ప ఆచరణలో అభివృద్ధి లేదన్నారు. గ్రామపంచాయతీల మొదలు అనేక సంక్షేమ పథకాల్లో కేంద్ర ప్రభుత్వ నిధులే ఎక్కువని, ప్రచారం మాత్రం బీఆర్‌ఎస్ చేసుకోవడం సిగ్గుచేటన్నారు. శిలాఫలకాలపై బీఆర్‌ఎస్ నాయకులవనీ నిధులు మాత్రం కేంద్రానివన్నారు. కార్యక్రమంలో మానుపురి ప్రభాకర్, గంధం ప్రసాద్‌గౌడ్, మాలోతు ప్రశాంత్, మాదారపు లక్ష్మణ్, బత్తుల వెంకటేశ్వర్లు, జట్టి అజయ్, నవీన్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

స్టోర్ దిగుమతులు హమాలీలకే ఇవ్వాలి



నిర్వాహకులతో మాట్లాడుతున్న నాయకులు

పాల్వంచ: పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లోని నిత్యావసర సరుకుల స్టోర్‌కు చెందిన లోడింగ్, అన్‌లోడింగ్ పని స్థానిక హమాలీ కార్మికులకే ఇవ్వాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే.రమేష్ మాట్లాడుతూ.. స్థానిక హమాలీలు ఈ పనులపై ఆధారపడి జీవిస్తుంటారని, వారికి ఇవ్వాల్సిన పనిని ఇతరులతో చేయించడంతో స్థానికులు నష్టపోతారన్నారు. తక్షణం వారికి సహకరించాలని కోరారు. దొడ్డా రవికుమార్, డి.వీరన్న, ముత్యాల విశ్వనాథం, చారి, లింగయ్య రాంబాబు, ఐలయ్య పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో మైనర్లు

ఇల్లెందు: శాసనసభ ఎన్నికల షెడ్యూల్ వచ్చింది. ఎవరికి టికెట్ వస్తుందో తెలియదు.. నామినేషన్లు దాఖలు కాలేదు.. కానీ ఎన్నికల వేడి మొదలైంది. అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల రణరంగంలోకి దిగాయి. తమ కార్యకర్తలు, నాయకులతో పాటు ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాయి. ఇందుకు మైనర్లను పావులుగా వాడుకుంటున్నాయి. శుక్రవారం ఇల్లెందులో ఓ పార్టీ ప్రచార ర్యాలీలో కరపత్రాలు పంపిణీ చేసేందుకు మైనర్లను వాడుకుంది. ఓటు హక్కు కూడా లేని మైనర్లు ఓ పార్టీ తరుపున ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ విషయంపై ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పలకల వితరణ



చిన్నారులకు పలకలు అందజేస్తున్న శ్రీతన్

జూలూరుపాడు: అనంతారం అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న చిన్నారులకు శుక్రవారం అదే గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు కొదుమూరి భానుప్రకాష్, గాయత్రి దంపతుల మనవడు దేవిశెట్టి శ్రీతన్ గుప్త పలకలను వితరణ చేశారు. దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆరవ రోజు శ్రీ సరస్వతి దేవీ రూపంలో అమ్మవారు మూలనక్షత్రంలో ప్రవేశించిన శుభ సందర్భంగా చిన్నారులకు పలకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుజాత, ఐశ్వర్య, శివ, ఆయా, చిన్నారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జూలూరుపాడు: సాయిరాంతండా గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు... జూలూరుపాడు ఎస్సీ కాలనీకి చెందిన మందా రాజశేఖర్, ఇస్రం చింటు బైక్‌పై కొత్తగూడెం వెళ్లి తిరిగి జూలూరుపాడు వస్తున్నారు. ఈ క్రమంలో ఖమ్మం వెళ్తున్న భద్రాచలం డిపో బస్ ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న ఇద్దరూ కిందపడ్డారు. రాజశేఖర్‌కు తీవ్ర గాయాలు కాగా, చింటుకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు.

కేసు నమోదు

పాల్వంచ: మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిపై శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాలు.. స్థానిక వనమా కాలనీకి చెందిన దానియేల్ అతని ఇంటికి పని చేసేందుకు వచ్చిన మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ రాఘవయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.